క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడియం మండలం కడియపు లంకకు చెందిన ఆర్‌బీఎస్ శ్రీనివాస్ ఆదివారం రూ.25వేలు విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాత శ్రీనివాస్‌ను వేదమంత్రాలతో సత్కరించి ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విత్తన శుద్ధిపై అవగాహన

మామిడికుదురు: ఈదరాడలో బీజామృతంతో విత్తన శుద్ధిపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ చెల్లుబోయిన రాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ఎంతో శ్రేయస్కరమని రాధ తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల విత్తనం, భూమి నుంచి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు అన్నారు. దీంతో పాటు నారు ఆరోగ్యంగా పెరుగుతుందని చెప్పారు. మొలక శాతం ఆశించిన విధంగా ఉంటుందన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్క రైతు ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్–2 కుడుపూడి జానకి, మెంటర్ కుడుపూడి నాగదుర్గ, రైతులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

కొత్తపేట: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతిపై పలువురు నాయకులు, కళాకారులు, సాహితీ వేత్తలు సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, స్థానిక పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విలక్షణమైన నటుడు, వివిధ మాండలికాల్లో మాట్లాడి ప్రేక్షకులను అలరించిన క్యారెక్టర్ ఆర్టిస్టుగానే కాక, ఎమ్మెల్యేగా రాజకీయ రంగంలో పేరొందిన కోట శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు. ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డీ రాజ్‌కుమార్‌వుడయార్ కోట మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు తనకు భీమవరంలో ఒకే వేదికపై సన్మానం చేశారని అన్నారు. ఆయన నటనా శైలి విభిన్నమైందన్నారు. ఆయన సినీ రంగ ప్రవేశంతో నటనలో కొత్తదనం వచ్చిందన్నారు. కళాసాహితి సభ్యుడు షేక్ గౌస్ కోట మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాడివారి మెరకకు చెందిన తాడి అశోక్‌కుమార్ ఇటీవల కొబ్బరి చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. మృతుడితో కలసి 2001–2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయాన్ని ఆదివారం మృతుడి భార్య నాగమణి, కుమార్తెకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, పూర్వ విద్యార్థులు దీపాటి సూర్యప్రకాష్, జాలెం క్రాంతివర్ధన్, చింతా సుధీర్, తాడి రామకృష్ణ, బత్తుల వెంకటరమణ, తాడి నరసింహారావు, తాడి లక్ష్మణరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లి విఘ్నేశ్వరునికి పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో ఇరువురు చిన్నారులకు అక్షరభ్యాసం, తొమ్మిది మంది చిన్నారులకు తులాభారం, 13 మంది చిన్నారులకు అన్నప్రాసన చేశా రు. స్వామికి తొమ్మిది మంది భక్తులు తలనీలా లు సమర్పించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,51,704 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ నూరి అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి మాస కలయాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరపున ఈఓ రమణమూర్తి పట్టు వస్త్రాలు సమర్పించగా, పలువురు భక్తులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చందన వెంకన్నగా దర్శనం

అంబాజీపేట: గ్రామ శివారు కొర్లపాటివారిపాలెంలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామికి నిర్వహించే అభిషేక ఉత్సవంలో భాగంగా ఆదివారం చందనంతో అలంకరించారు. ఆలయ అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో సుమారు 4 కేజీల చందనంతో స్వామిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం

- రోడ్లపై దమ్ము ట్రాక్టర్ల ప్రయాణం
- పాడైపోతున్న వైనం
- నిబంధనలు బేఖాతర్
- అధికారుల చర్యలు శూన్యం


ఆలమూరులో దమ్ము చక్రాలతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌తో దెబ్బతిన్న పుంత రోడ్డు

ఆలమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభకావడంతో గ్రామీణ ప్రాంతాల్లో దమ్ము ట్రాక్టర్ల వినియోగం ఎక్కువైంది. అడ్డు అదుపూ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రామాల్లోని తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు, గ్రావెల్‌తో వేసిన పుంతరోడ్లు ఛిద్రమవుతున్నాయి. సంవత్సరాల తరబడి మన్న వలసిన రోడ్లు కొద్ది నెలలకే గోతులు పడి శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్న ఈ తరుణంలో బద్దె లేకుండా దమ్ము చక్రాలతో నడవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. దమ్ము ట్రాక్టర్ల ప్రవేశానికి కనీస నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఇటీవల నిర్మించిన రహదారులు బీటలు వారి పోయి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. దీనివల్ల వర్షపు నీరు గోతుల్లో ఉండి తక్కువ సమయంలోనే మరమ్మతులకు చేరుకుంటున్నాయి.

దమ్ము ట్రాక్టర్ల జోరు

ఖరీఫ్ సీజన్ పనులు జోరందుకున్నందున పంట పొలాల్లో విపరీతంగా ట్రాక్టర్లు దమ్ము చేస్తున్నాయి. దీనివల్ల కొంత మంది ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటిస్తున్నా మరి కొంతమంది సమయాభావం లేక బద్దెలేని దమ్ము చక్రాలతోనే రహదారులపైకి వస్తున్నారు. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు చూసీచూడనట్లు వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అధికారులు దమ్ము చక్రాల ట్రాక్టర్‌ను సీజ్ చేసినా పాలకుల ఒత్తిడితో సత్వరమే బయటకు వస్తున్నాయి. దీనివల్ల కూడా అధికారులు పట్టించుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. అయితే ఇటీవల కొన్ని గ్రామాల్లో చిన్న ట్రాక్టర్లు ఎక్కువగా దమ్ము చేయడం కొంత మేర ఊరటనిస్తుంది.


పెదపళ్లలో అధ్వానంగా ఉన్న రోడ్డు

నిబంధనలు పాటించుకోకపోవడంతో..

ప్రభుత్వం విధించిన నిబంధనలను ట్రాక్టర్ యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాహన దారుడు పొలాల్లో దమ్ము చేసేందుకు వెళుతున్నప్పుడు కచ్చితంగా చక్రాలకు నునపబద్దెను అమర్చుకోవాలి. లేకుంటే పొలంలోకి టైర్లతోనే వెళ్లి అక్కడే దమ్ము చక్రాలను బిగించుకోవాలి. అనంతరం మరొక పొలంలో వెళ్లాలనుకుంటే మళ్లీ టైర్లు మార్చుకుని ప్రవేశించాలి. దమ్ము పూర్తయిన అనంతర మళ్లీ టైర్లు బిగించుకుని గమ్య స్థానానికి చేరుకోవాలి. కనీస భద్రతా చర్యలు పాటించని ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తే మిగిలిన వారైన నిబంధనలను పాటించే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

శ్రీనివాస్ ప్రభూజీ సేవలు అభినందనీయం


సుందర శ్రీనివాస్ ప్రభూజీ సత్కరిస్తున్న, గణేశుల వెంకటేశ్వరరావు తదితరులు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు శ్రీమాన్ సుందర శ్రీనివాస్ ప్రభూజీ అందిస్తున్న సేవలను మందిర్ స్థల దాత, పారిశ్రామిక వేత్త గణేశుల వేంకటేశ్వర రావు దంపతులు అభినందించారు. ఆదివారం శ్రీకృష్ణమందిర్‌లో శ్రీమాన్ సుందర శ్రీనివాస్ ప్రభూజీని శాలువా వేసి సత్కరించారు. సుందర శ్రీనివాస్ ప్రభూజీ శ్రీకృష్ణ తత్వంను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిసరాలలో చాటి చేబుతున్నారన్నారు. నల్లచెరువు గ్రామంలో రూ. కోట్లతో సుందరంగా శ్రీకృష్ణ మందిర్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. అందుకు దాతల సహకారం తీసుకుంటున్నారన్నారు.

శాలివాహన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి


మాచవరంలో త్రిమూర్తులను సత్కరిస్తున్న సంఘు నాయకులు

అంబాజీపేట: నేటి సమాజంలో కుమ్మరి శాలివాహనులు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడి ఉన్న నేపథ్యంలో కుమ్మరి శాలివాహనలు ఒక ఎమ్మెల్సీ కేటాయించడంతో పాటు శాలివాహన కార్పొరేషన్‌కు ఇతోధికంగా నిధులు కేటాయించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ సమావేశం ఏకగ్రీవంగా కోరింది. మాచవరంలో ఉన్న శాలివాహన సంక్షేమ సంఘ భవనంలో ఆదివారం శాలివాహన సంఘ సమావేశము డి.భీమేస్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీర బ్రహ్మం మాట్లాడుతూ శాలివాహనులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న నేపథ్యంలో ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని, శాలివాహన కార్పొరేషన్‌కు ఎక్కువగా నిధులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ప్రతి నెల 22 మండలాల్లో శాలివాహన సంఘ ప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేసి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం సంఘ గౌరవాధ్యక్షుడిగా వెల్ల త్రిమూర్తులను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో ఆయా మండల శాలివాహన సంఘ అధ్యక్షుడు, కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణ మూర్తి, సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ మంతెన శ్రీనివాస్, వెల్ల శ్రీనివాస్, కొడమంచిలి సూరిబాబు, తానేలంక వెంకటేశ్వరరావు, ఏడిద నాగరాజు, పాలకొల్లు వెంకటరమణ అంబటి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


గోగన్నమఠంలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: రాజోలు మండలం పొన్నమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 48 ఏళ్ల విరామం తర్వాత మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామంలో సందడి చేశారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. వైనతేయ గోదావరి నదీ తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్వ సమ్మేళనం ఆద్యంతం కన్నుల పండుగలా జరిపించారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. వారికి మెమెంటోలు అందించారు. తాము చదువుకున్న స్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు తమ వంతు సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, అప్పారి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి జయప్రకాష్, సాగి సత్యనారాయణరాజు, అప్పారి సూర్యనారాయణ, కొంబత్తుల గంగాభవాని, వడ్డి సునీత, భాగవతుల లక్ష్మి, బొలిశెట్టి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం


అంబాజీపేటలో జరిగిన తైక్వాండో గ్రేడ్ టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసానికి తైక్వాండో ఎంతో అవసరమని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు శ్రీనివాస తైక్వాండో క్లబ్ చీఫ్ కోచ్‌కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ గ్రేడింగ్ టెస్ట్‌లో జిల్లా నుంచి 130 మంది క్రీడాకారులు గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్నారు. అర్జునరావుతో పాటు సీనియర్ కోచ్ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో 120 మంది బెల్ట్ గ్రేడింగ్ పొందారు. ఈ పోటీలలో అంబాజీపేట, రాజోలు, ముంగండ, ఇరుసుమండ, అమలాపురం తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు పితాని భార్గవి శ్రీకళ, పి.నాగభూషణం, కె.మణికంఠ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీట మునిగిన కూరగాయల తోటలు


పెదపట్నం మధ్యలంకలో నీట మునిగిన బీర పాదులు


పెదపట్నంలంక గోదావరి నదీ తీరంలో కూలిన కొబ్బరి చెట్లు

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతికి కూరగాయల తోటలు నీట మునిగాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన కూరగాయల పంటలు దిగుబడి ఇచ్చే సమయంలో ముంపు బారిన పడడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదపట్నం మధ్యలంకతోపాటు పెదపటన్నంలంక గోదావరి నదీతీరంలో సాగు చేసిన బీర, బెండ, మునగ, వంగ, దొండ తోటలు నీట మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన కూరగాయల పంటలు వరద నీటిలో మునిగిపోయాయని పెదపట్నం గ్రామానికి చెందిన రైతు ముత్యాల సూరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలన్నారు. గోదావరి వరద నీటి మట్టం క్రమేపీ పెరుగుతూ ఉండడంతో తీర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లి స్నానాల రేవులో వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. అప్పనపల్లి ఏటి గట్టు దిగువన ఉన్న కాజ్‌వేకు రెండు వైపులా వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఇక్కడ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. దీంతో రెవెన్యూ అధికారులు కాజ్‌వేకు ఇరువైపులా ఎర్రజెండాలతో కర్రలు పాతారు. వరద మరింత పెరిగితే ముంపుబారిన పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి తదితర గ్రామాల్లో కోత తీవ్రంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో తీర గ్రామాల ప్రజలు కొంత ఉపశమనం పొందారు. సోమవారం వరకు వరద ఉధృతి కొనసాగుతుందని తర్వాత క్రమేపీ తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం


వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహారావు, శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: తనయుడిని ఓ డాక్టర్‌గా చూడాలనుకున్న తల్లిదండ్రులు ఆ తనయుని స్మృతిలో ఉచిత వైద్య, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆరు జిల్లాలు) ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు అన్నారు. స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వద్ద ఆదివారం ఫ్రీ 'బోన్ మినరల్ డెన్సిటీ' అండ్ 'ఐ' క్యాంపు నిర్వహించారు. సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెంకటేశ్వర్లు (చిట్టిబాబు) – సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం యూనివర్సల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్పీ నరసింహారావు ప్రారంభించారు. ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్ర బాబు ఆరుమిల్లి ఆధ్వర్యంలో బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా చేశారు. ఈ సేవలను 165 మంది వినియోగించుకున్నారు. వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆస్పత్రి ద్వారా ఐ స్పెషలిస్టు డాక్టర్ అఖిల 128 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 22 మందిని ఆపరేషన్ అవసరమని గుర్తించి రాజమహేంద్రవరం అకీరా కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు వలంటరీ సేవలు అందించారు.

అద్భుతం.. వుడయార్ శిల్ప కళా ప్రాంగణం

శిల్పాశ్రమాన్ని సందర్శించిన ఏపీఎస్‌పీఎఫ్ ఎస్పీ నరసింహారావు


కొత్తపేట వుడయార్ శిల్పశాలలో ఎస్పీ దంపతులు

కొత్తపేట: ఈ శిల్ప కళా ప్రాంగణం ఓ అద్భుత కళా ఖండం.. ఏ విగ్రహాన్ని చూసినా దానిలో జీవకళ ఉట్టిపడుతోందని కొత్తపేట వుడయార్ శిల్పాశ్రమాన్ని చూసిన ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ (ఆరు జిల్లాలు) డాక్టర్ కొండా నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన తన సతీమణి అలివేలు మంగాదేవితో కలిసి కొత్తపేటలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డీ రాజ్‌కుమార్ వుడయార్‌కు చెందిన శ్రీనాథ రత్నశిల్పి వుడయార్ సాంస్కృతిక సేవా సంస్థ ప్రాంగణం, శిల్పాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంగణాల్లో నమూనా విగ్రహాలు, తయారవుతున్న విగ్రహాలను వారు తిలకించారు. జీవకళ ఉట్టిపడేలా నిలువెత్తు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు, ఎస్వీ రంగారావు, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి ప్రముఖులు, మహానటులు, మహాత్మా జ్యోతిరావుపూలే, గుర్రంపై సర్ ఆర్థర్ కాటన్, ఛత్రపతి శివాజీ, రాణి రుద్రమదేవి వంటి చరిత్రకారుల విగ్రహాలను చేసి తన్మయత్వం చెందారు. ఈ ప్రాంగణం అద్భుతమైన కళా ఖండం అని పేర్కొంటూ శిల్పి రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శిల్ప కళపై ముచ్చటించారు. శిల్ప కళలో తనది మూడో తరమని, వారి నుంచి నేటి తన హయాంలో రూపొందించిన విగ్రహాలు గురించి శిల్పి, ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ దంపతులను శిల్పి ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ


దుర్గాప్రసాద్‌ను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

మామిడికుదురు: ఇటీవల అస్వస్థతకు గురైన వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం యూత్ విభాగం అధ్యక్షుడు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. పాశర్లపూడిలోని దుర్గాప్రసాద్ ఇంటికి వచ్చి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, మండపేట నియోజకవర్గం పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, అంబాజీపేట మండల శాఖ అధ్యక్షులు విత్తనాల శేఖర్, పార్టీ నాయకులు ఉన్నారు.

వైద్య ఆరోగ్య మహిళా ఉద్యోగుల సమావేశం


రాజోలు: సబ్‌సెంటర్ భవనంలో ఆదివారం రాజోలు సబ్ డివిజన్ పరిధిలోని వైద్య, ఆరోగ్య శాఖ మహిళా ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జయమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం వైద్య, ఆరోగ్యశాఖలో పెరుగుతున్న పని భారం, పెండింగ్ బకాయిలు, పదోన్నతులు తదితర అంశాలను ఆమె ప్రస్తావించారు. వీటి పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాజోలు సబ్‌డివిజన్ పరిధిలోని మహిళా ఉద్యోగులను సంఘటితం చేయాలని సూచించారు. పశ్చిమ అధ్యక్షురాలు నాగరత్నం, ఏలూరు జిల్లా ప్రతినిధి బేబీ, రాజోలు సబ్‌డివిజన్ ప్రతినిధి సరస్వతి పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి హాజరైన రాజోలు సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి వై.ఆదినారాయణ సంఘీభావం తెలిపారు.

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు


కన్యకాపరమేశ్వరి


మురుగులమ్మతల్లి


దొడ్డి గంగాలమ్మ


పళ్లాలమ్మకు నివేదించిన సారె


వనువులమ్మ, కనకదుర్గ అమ్మవార్లకు సమర్పించిన సారె


పళ్లాలమ్మకు సమర్పించిన స్వీట్లు

అంబాజీపేట: ఆశాఢ మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట బస్టాండ్ సమీపంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల 100 కేజీల కూరగాయలతో అమ్మవారిని కనువిందులుగా అలంకరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలిత పారాయణం చేశారు. అన్నసమారాధన చేపట్టారు.

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామ దేవతగా పూజలందుకుటున్న మురుగులమ్మతల్లి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని ఆలయ కమిటీ సభ్యులు పండ్లు, కూరగాయలతో అలంకరించారు.

మామిడికుదురు: నగరం గ్రామ దేవత దొడ్డి గంగాలమ్మను గ్రామస్తులు శాకంబరిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహా స్వామివారి దేవస్థానానికి అనుబంధ దేవాలయంలో కొలువై ఉన్న గుర్రాలక్క అమ్మవారు ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలను అర్చకులకు, అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ అందజేశారు. అంతర్వేది లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానానికి భక్తుల నుంచి వివిధ సేవలు రూపేణా, అన్నదాన ట్రస్టుకు విరాళాలు రూపేణా మొత్తం రూ.2,25,875 ఆదాయం సమకూరినట్లు ఏసీ ప్రసాద్ వెల్లడించారు.

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలోని జగ్గన్నపేటలో ఉన్న పళ్లాలమ్మకు వంద రకాల స్వీట్లు సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో పాటు పలు రకాల స్వీట్లను సారెగా చెల్లించారు. వీటితో పాటు అరటి, యాపిల్, దానిమ్మ, ద్రాక్ష వంటి పండ్లను అమ్మవారికి చెల్లించారు. చామంతి, బంతి, గులాబి వంటి వివిధ రకాల పుష్పాలను సారెగా తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు సారె సమర్పించారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు వివిధ రకాల స్వీట్స్‌తో సారె సమర్పించారు.

రాజోలు: స్థానిక మార్కెట్ ఏరియాలో కొలువై ఉన్న వనువులమ్మ, కనకదుర్గ అమ్మవార్లకు ఆదివారం చీర, సారెను భక్తులు సమర్పించారు. సంఘ సెక్రటరీ కొత్త నాగ వెంకట పద్మావతి, కాసు రాణి, సుధ, పలువురు మహిళలు పాల్గొన్నారు.